క్లుప్తంగా

రాగి జావ గ్లాసులు పంపిణీ



పామర్రు(తోట్లవల్లూరు): జగనన్న గోరుముద్ద పథకంలో మెనూలో కొత్తగా చేర్చిన రాగిజావ తాగేందుకు ప్రభుత్వ పాఠశాలలోని చిన్నారులకు ప్రభుత్వం గ్లాసులను ఉచితంగా అందజేసింది. ఈ సందర్భంగా రాగి జావ గ్లాసులను తోట్లవల్లూరు మండలం దేవరపల్లి గ్రామంలో జెడ్పీటీసీ జొన్నల రామ్మోహన్‌రెడ్డి, సొత్‌వల్లూరు మెయిన్ ఎంపీపీ పాఠశాలలో మండల ఎంపీపీ ఈడ్పుగంటి రాజామణి చిన్నారులకు రాగి జావ గ్లాసులను పంపిణీ చేశారు. మండల పరిధిలోని 36 పాఠశాలల్లో 2,400 మంచి విద్యార్థులకు ప్రభుత్వం ఈ గ్లాసులను ఉచితంగా సరఫరా చేసింది. కార్యక్రమంలో ఎంఈవో జి.వెంకటేశ్వరరావు, పాఠశాలల హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

భక్తులకు మజ్జిగ పంపిణీ

గుడివాడటౌన్: కొనగళ్ల చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో శనివారం భక్తులకు మజ్జిగ పంపిణీ చేశారు. స్థానిక ఆర్యవైశ్య కల్యాణ మందిరంలో గల శ్రీ కల్యాణ వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో చారిటబుల్ ట్రస్ట్ సేవా కార్యక్రమాల్లో భాగంగా ఈ మజ్జిగ పంపిణీ చేసినట్లు ట్రస్ట్ చైర్మన్ కొనగళ్ల సీతయ్య తెలిపారు.

ఆర్థిక సాయం

ముదినేపల్లిరూరల్: అగ్నిప్రమాదంలో సర్వస్వం కోల్పోయిన బాధిత కుటుంబానికి స్థానిక ప్రముఖ వైద్యుడు అంబుల మనోజ్ శనివారం రూ.5 వేలు సాయం అందించారు. మండలంలోని వణుదుర్రుకు చెందిన మద్దెల నందిరాజు ఇల్లు శుక్రవారం షార్ట్‌సర్క్యూట్‌తో దగ్ధమైంది. ఈ నేపథ్యంలో నందిరాజు కుటుంబ సభ్యులకు డాక్టర్ మనోజ్ ఆర్థిక సాయంతో పాటు నిత్యావసర వస్తువులు పంపిణీ చేశారు.

పంట బోదె అభివృద్ధి పనులు

మండవల్లి: మండలంలోని అయ్యవారిరుద్రవరం గ్రామంలో శనివారం పంట బోదె అభివృద్ధి పనులు నిర్వహించారు. రూ.1 లక్షా 20 వేల నిధులతో 65 మంది కూలీలు పనులు చేసినట్లు ఎంటీఏ నవీన్ తెలిపారు. ఈ పనుల ద్వారా సాగు, తాగునీటి సమస్యలు పరిష్కారమవుతున్నాయని, చెరువులు అభివృద్ధి చేయడం ద్వారా పశువులకు తాగునీటి సమస్య తీరుతుందన్నారు.

మట్టి ఖర్చులకు నగదు అందజేత

మండవల్లి: మండలంలోని భైరవపట్నం పీఏసీఎస్‌లో రుణం పొంది ఇటీవల మృతి చెందిన కొండా నాగమణి కుటుంబ సభ్యులు ఆదిశేషు దంపతులకు మట్టి ఖర్చుల నిమిత్తం శనివారం సొసైటీ చైర్‌పర్సన్ ఆచంట వెంకటరత్నం రూ.10 వేలు అందజేశారు. ఉప సర్పంచ్ నీలపాల రాధా నాగేంద్రరావు, కన్వీనర్ వల్లూరి ఆదినారాయణ, మోదుగుమూడి వెంకట్రావు, గొంతుపులుగు సుభాష్‌చంద్రబోస్, ఆగొల్లు గంగరాజు పాల్గొన్నారు.

17న మండల సర్వసభ్య సమావేశం

గుడివాడ టౌన్(నందివాడ): నందివాడ మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఈనెల 17వ తేదీ మధ్యాహ్నం 2 గంటలకు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ బీవై విష్ణుప్రసాద్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ పెయ్యల ఆదాం అధ్యక్షతన జరిగే ఈ సమావేశంలో వివిధ అభివృద్ధి కార్యక్రమాలపై సమీక్ష ఉంటుందన్నారు.

సారా స్వాధీనం ఇద్దరు అరెస్ట్

కైకలూరు: మండవల్లి మండలం పెనుమాకలంక గ్రామానికి చెందిన ఘంటసాల ఏడుకొండలు, పెద వెంకన్నలను అరెస్టు చేసి వారి నుంచి ఏడు లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నట్టు సెబ్ సీఐ ఎస్.రాంబాబు తెలిపారు. నిందితులను కైకలూరు కోర్టుకు తరలించగా న్యాయమూర్తి 14 రోజులు రిమాండ్ విధించారని తెలిపారు. దాడుల్లో ఎస్ఐ జైనులాబ్దిన్, సిబ్బంది పాల్గొన్నారు.

పెదకళ్లేపల్లిలో పూరిల్లు దగ్ధం



పెదకళ్లేపల్లి(మోపిదేవి): పెదకళ్లేపల్లికి చెందిన వృద్ధురాలు శనగల నాగేశ్వరమ్మ పూరిల్లు శనివారం సాయంత్రం దగ్ధమైంది. నాగేశ్వరమ్మ భర్త గతంలోనే మృతిచెందాడు. కుమార్తెకు వివాహం కావడంతో అత్తారింటికి వెళ్లిపోయింది. ప్రస్తుతం నాగేశ్వరమ్మ ఒంటరిగా పూరిపాకలోనే జీవిస్తోంది. గ్రామస్తులు మంటలను అదుపుచేశారు. పూరిపాక దగ్ధం కావడంతో నాగేశ్వరమ్మ కట్టుబట్టలతో మిగిలింది. వీఆర్వో రమణ ఘటనాస్థలాన్ని సందర్శించి వివరాలు సేకరించారు.

మంచినీటి సమస్య వెంటనే పరిష్కరిస్తాం

ఎమ్మెల్యే కొడాలి నాని



మహిళలకు ప్రభుత్వం నుంచి చేకూరిన లబ్ధిని వివరిస్తున్న ఎమ్మెల్యే కొడాలి నాని

గుడివాడ టౌన్: పట్టణంలోని సత్యన్నారాయణపురంలో మంచినీటి సమస్య ఉన్నట్లు తమ దృష్టికి వచ్చిందని, వెంటనే పరిష్కరించేందుకు కృషి చేస్తామని ఎమ్మెల్యే కొడాలి శ్రీవెంకటేశ్వరరావు(నాని) తెలిపారు. స్థానిక సత్యనారాయణపురం 23వ వార్డులో శనివారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో ఉన్న పైప్ లైన్ చివరి భాగం సత్యనారాయణపురంలో మిగిలిపోవడంతో సమస్య ఏర్పడిందన్నారు. స్థానిక గుడ్‌మెన్ పేటలో నిర్మిస్తున్న వాటర్‌ట్యాంక్ పూర్తయిందని, త్వరలోనే దానికి పంపుల చెరువు నుంచి ప్రత్యక్షంగా నీటిని నింపే ఏర్పాటు చేశామన్నారు. ఆ లైన్‌తో సత్యన్నారాయణపురం లైన్ అనుసంధానం చేస్తే పూర్తి వత్తిడితో నీటి సరఫరా ఉంటుందని, తద్వారా నీటి సమస్య పరిష్కారమవుతుందన్నారు. స్థానికంగా ఒక్క నీటి సమస్య మినహా ఏ విధమైన సమస్యలు తమ దృష్టికి రాలేదని అన్ని ఏర్పాట్లు సంతృప్తికరంగా ఉన్నట్లు స్థానికులు తెలపడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు దుక్కిపాటి శశిభూషణ్, పాలడుగు రాంప్రసాదు, పాలేటి చంటి, మున్సిపల్ మాజీ కౌన్సిలర్‌లు వీరిశెట్టి నరసింహారావు, వంగలపూడి కనకబాబు, చింతల భాస్కరరావు, పార్టీ పట్టణ అధ్యక్షుడు గొర్ల శ్రీను, రూరల్ మండల అధ్యక్షుడు మట్టా జాన్ విక్టర్, పలువురు సచివాలయ కన్వీనర్‌లు, పార్టీ నాయకులు, మహిళా కార్యకర్తలు పాల్గొన్నారు.

పేదలను సంపన్నులుగా చేయడమే జగనన్న లక్ష్యం

ఎమ్మెల్యేలు కైలే, సింహాద్రి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యేలు కైలే అనిల్‌కుమార్, సింహాద్రి రమేష్‌బాబు

పామర్రు: కులం, మతం, ప్రాంతం, పార్టీ చూడకుండా పేదలను ఆర్థిక సంపన్నులుగా చేయడమే ప్రధాన లక్ష్యంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం కృషి చేస్తోందని అవనిగడ్డ, పామర్రు శాసన సభ్యులు సింహాద్రి రమేష్‌బాబు, కైలే అనిల్ కుమార్ అన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ప్రజలు ప్రభుత్వంపై తిరగబడరేంటని ప్రతిపక్షనేత చంద్రబాబు ప్రశ్నించడం అవివేకం అన్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రజలను సుఖ సంతోషాలతో ఉంచుతూ, వారికి పారదర్శక పాలన అందిస్తున్నారని, అందుకే ప్రజలంతా జగన్ ప్రభుత్వానికి మద్దతు తెలుపుతున్నారని అన్నారు. ఈ నాలుగేళ్లలో ఇప్పటివరకు కోటికి పైగా కుటుంబాలు రూ.2.4 లక్షల కోట్ల మేరకు లబ్ధి పొందారని తెలిపారు. మహిళా సాధికారతే రాష్ట్ర అభివృద్ధికి కీలకం అని నమ్మిన జగనన్న అన్ని పథకాల ద్వారా కలిగే లబ్ధిలో 75 శాతం మహిళలకే అందిస్తున్నారని అన్నారు. జగనన్న కృషితో ఆర్థికాభివృద్ధిలో దేశంలోనే ఏపీ 22వ స్థానం నుంచి మొదటి స్థానానికి, తలసరి ఆదాయంలో 18వ ర్యాంక్ నుంచి 11కి మెరుగు పడినట్లు కేంద్రమే వెల్లడించిందని గుర్తుచేశారు. గతంలో చంద్రబాబు పాలనతో విరక్తి చెందిన ప్రజలు 2019లో టీడీపీకి 23 స్థానాలు ఇచ్చి సరిపెట్టారని, రానున్న కాలంలో అవి కూడా దక్కని పరిస్థితిని గమనించిన బాబు జగన్ ప్రభుత్వంపై అవాకులు చవాకులు మాట్లాడుతున్నారని, దీనిని ప్రజలు గమనిస్తున్నారన్నారు. రానున్న కాలంలో చంద్రబాబుకు మళ్లీ బుద్ధి చెప్పేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని అన్నారు. రానున్న 25 ఏళ్ల వరకు రాష్ట్రానికి సీఎంగా జగనన్నే ఉండాలని ప్రజలు అందరూ కోరుకుంటున్నారని ఎమ్మెల్యేలు తెలిపారు.

పేదల జీవితాల్లో వెలుగు వైఎస్ జగన్

- ఎమ్మెల్యే డీఎన్నార్
- జగనన్నే మా భవిష్యత్తుకు విశేష స్పందన



చినతాడినాడ గ్రామంలో ప్రజలకు సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే డీఎన్నార్

కైకలూరు(కలిదిండి): పేదల జీవితాల్లో వెలుగులు నింపుతున్న గొప్ప మనసున్న నేత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్) అన్నారు. కలిదిండి మండలం చినతాడినాడ, పోతుమర్రు, గుర్వాయిపాలెం, కొండంగి, మట్టగుంట, పెదలంక, మూల ఉప్పరగూడెం, భాస్కరరావుపేట, సంతోషపురం గ్రామాల్లో జగనన్నే మా భవిష్యత్తు – మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమం శనివారం ఉత్సాహంగా నిర్వహించారు. సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, వలంటీర్లతో కలిసి ఎమ్మెల్యే డీఎన్నార్ ఇంటింటికి వెళ్లి సంక్షేమ పథకాలను వివరించారు. ఇంటి యజమానుల అనుమతితో వారి తలుపులు, సెల్‌ఫోన్లకు మా నమ్మకం నువ్వే జగన్ స్టిక్కర్లను అతికించారు. అనంతరం ఎమ్మెల్యే డీఎన్నార్ మాట్లాడుతూ ఈ నెల 7న ప్రారంభమైన కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోందన్నారు. ఈ నెల 20 వరకు ఈ కార్యక్రమం కొనసాగుతుందని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీపీ చందన ఉమామహేశ్వరరావు, ఏఎంసీ చైర్మన్ ఐనాల బ్రహ్మాజీరావు, వైస్ ఎంపీపీ కట్టా నాగలక్ష్మి, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు తిరుమాని రమేష్, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, పీఏసీఎస్ అధ్యక్షులు, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జగనన్నకే ప్రజల మద్దతు

పామర్రు: రానున్న కాలంలో జగనన్నకే తమ పూర్తి మద్దతు తెలుపుతామంటూ ప్రజలు పేర్కొంటున్నారని 'మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమంలో పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు తెలిపారు. పామర్రులోని సచివాలయం–5 పరిధిలో చెన్నువానిపురం వద్ద శనివారం జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం నిర్వహించారు. ఆయా ప్రాంతాల్లో ఇంటింటికీ తిరిగి గత టీడీపీ ప్రభుత్వానికి ప్రస్తుత వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికి ఉన్న తేడాలను ప్రజలకు వివరించారు. ఐదు ప్రశ్నలకు అభిప్రాయాలను సేకరించి ప్రజా మద్దతు పుస్తకంలో నమోదు చేసి రశీదు అందజేస్తున్నారు. ప్రభుత్వానికి మద్దతు తెలిపిన వారిని 82960 82960 నంబర్‌కు మిస్డ్ కాల్ ఇవ్వాలని కోరుతున్నారు. ఆ తర్వాత నిమిషం లోపే సంబంధిత కుటుంబానికి ఐవీఆర్‌ఎస్ కాల్ ద్వారా సీఎం జగన్ కృతజ్ఞతలు తెలియజేస్తున్నారు. ప్రభుత్వానికి మద్దతు తెలిపిన వారికి వారి అనుమతితో వారి ఇంటి తలుపులకు, సెల్ ఫోన్‌లకు మా నమ్మకం నువ్వే జగన్ స్టిక్కర్లను అతికించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ ఆరేపల్లి శ్రీనివాసరావు, మండల సచివాలయ కన్వీనర్ ముప్పిడి సురేష్‌రెడ్డి, ఎంపీటీసీ తాడిశెట్టి శ్రీనివాసరావు, విజయవాడ కృష్ణామిల్క్ యూనియన్ జిల్లా ట్రస్టు బోర్డు సభ్యులు బొమ్మారెడ్డి కృష్ణారెడ్డి, సచివాలయ కన్వీనర్ పులి సురేష్, వైఎస్సార్ సీపీ నాయకులు బొమ్మారెడ్డి మాధవరెడ్డి, సజ్జా సుబ్రమణ్యం, మెరుగు వరప్రసాద్, తెర నాగరాజు, చిన్నం ప్రసాద్, తెర వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇరువురికి గాయాలు

పామర్రు: రోడ్డు ప్రమాదంలో ఇరువురికి గాయాలైన సంఘటన పామర్రు మండల పరిధిలో శనివారం జరిగింది. మండలంలోని కొండిపర్రు గ్రామానికి చెందిన ఇద్దరు వ్యక్తులు తమ టీవీఎస్ వాహనంపై గ్రామం నుంచి పామర్రుకు వస్తున్నారు. మార్గ మధ్యంలో ఉన్న విజయవాడ–మచిలీపట్నం జాతీయ రహదారి దాటుతున్న క్రమంలో అటుగా వస్తున్న కారు టీవీఎస్‌ను బలంగా ఢీ కొట్టింది. దీనితో టీవీఎస్‌పై ప్రయాణిస్తున్న ఇరువురికి తీవ్ర గాయాలయ్యాయి. క్షత గాత్రులను 108లో ప్రభుత్వ ఏరియా వైద్యశాలకు తరలించారు. పోలీసులు సంఘటనా స్థలం చేరుకుని వివరాలను సేకరించారు.

ముదినేపల్లిలో చలివేంద్రం ప్రారంభం

ముదినేపల్లిరూరల్: ముదినేపల్లి సచివాలయం వద్ద ఏర్పాటుచేసిన చలివేంద్రాన్ని సర్పంచ్ నిమ్మగడ్డ కైకమ్మ, తహసీల్దార్ కె.శ్రీనివాస్, ఎంపీడీఓ పి.మల్లీశ్వరి శనివారం ప్రారంభించారు. వేసవి పూర్తయ్యే వరకు దీనిని కొనసాగిస్తామని సర్పంచ్ తెలిపారు. కార్యక్రమంలో కార్యదర్శి విజయసారథి, శేషగిరిరావు, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు నిమ్మగడ్డ భిక్షాలు, కొల్లి నాని, పాలకవర్గ సభ్యులు పాల్గొన్నారు.

గెస్ట్ ఫ్యాకల్టీ పోస్టులకు నోటిఫికేషన్

మొవ్వ: మండల కేంద్రం మొవ్వ గ్రామంలోని వేమూరి సుందర రామయ్య ప్రభుత్వ డిగ్రీ, పీజీ కళాశాలలో గెస్ట్ ఫ్యాకల్టీ కంప్యూటర్ సైన్స్, జువాలజీ పోస్టులు భర్తీ చేసేందుకు నోటిఫికేషన్‌ను విడుదల చేసినట్లు కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.మాధవి శనివారం తెలిపారు. సంబంధిత సబ్జెక్టుల్లో పీజీలో ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణులై ఉండాలని, ఎన్‌ఈటీ, సెట్, పీహెచ్‌డీ, ఎస్ఎల్‌ఈటీ, అనుభవం ఉన్నవారికి ప్రాధాన్యం ఇస్తామని వెల్లడించారు. అభ్యర్థులు తమ రెజ్యూమ్‌లను కళాశాల చిరునామాకు లేదా gdcjkc.movva@gmail.comకు మెయిల్ చేయాల్సిందిగా పిలుపు నిచ్చారు. ఈ పోస్టులను ఇంటర్వ్యూ ప్రాతిపదికన ఎంపిక చేస్తామని, ఇంటర్వ్యూలను ఈ నెల 20వ తేదీన కళాశాలలో నిర్వహిస్తామని తెలిపారు.

ఘనంగా అంకమ్మతల్లి సంబరాలు ప్రారంభం



అంకమ్మతల్లి అమ్మవారి ఘటాలను గ్రామంలో ఊరేగింపు నిర్వహిస్తున్న జంపాన వంశస్తులు

పామర్రు(పమిడిముక్కల): మండలంలోని గురజాడ గ్రామంలో శ్రీ పోతురాజు స్వామి ఆలయ సమీపంలో ఉన్న జంపాన వంశస్తుల ఇలవేల్పు శ్రీ అంకమ్మతల్లి సంబరాలు శనివారం వైభవంగా ప్రారంభమయ్యాయి. శక్తి ఆధార సంప్రదాయ రీతిలో అంకమ్మతల్లి సంబర మహోత్సవానికి శాస్త్రోక్తంగా అంకురార్పణ చేశారు. గర్భాలయంలో అమ్మవారికి అభిషేక పూజలను నిర్వహించి అంకమ్మతల్లి ప్రతీక అయిన ఘటాలను తోట్లవల్లూరు మండలం దేవరపల్లి గ్రామంలోని కృష్ణానదిలో పుష్కర ఘాట్‌కు ఊరేగింపుగా తీసుకువెళ్లి పవిత్ర స్నానాది పూజాదికాలు నిర్వహించారు. అనంతరం గురజాడ గ్రామ పొలిమేరలకు చేరుకుని అంకమ్మతల్లి ప్రతీక ఘటాలకు అంగరంగ వైభవంగా గ్రామోత్సవం నిర్వహించారు. గ్రామ పురవీధుల వెంబడి అమ్మవారి ఘటాలను మేళ తాళాలతో ఊరేగించి ఆలయానికి తీసుకువచ్చారు. రహదార్ల వెంబడి భక్తులు అమ్మవారి ప్రతీకలకు పసుపు నీళ్లతో వార పోస్తూ పసుపు కుంకుమలతో హారతులను సమర్పించారు. ఆలయ ప్రాంగణంలో సంబరం సందర్భంగా వచ్చిన జంపాన వంశస్తుల కుటుంబాల వారు అంకమ్మతల్లికి పూజలు నిర్వహించారు. సంబరాలలో తొలిరోజు మాత మైలు కార్యక్రమం నిర్వహించారు. డప్పు వాయిద్యాల హోరులో ఆరంభమైన జంపాన వారి ఇలవేల్పు అంకమ్మతల్లి సంబరం మహోత్సవంలో భాగంగా రెండవ రోజు ఆదివారం మొక్కుబడులు సమర్పణ విశేష పూజా కార్యక్రమాలు జరుగుతాయని ఆలయ కమిటీ సభ్యులు వెల్లడించారు.

అగ్నిప్రమాదాల నివారణ చర్యలపై అవగాహన

పామర్రు: చిన్న చిన్న తప్పిదాల వల్ల అగ్నిప్రమాదాలు సంభవిస్తున్నాయని, అప్రమత్తంగా ఉంటే ప్రమాదాలు నివారించవచ్చని పామర్రు అగ్నిమాపక అధికారి రాంబాబు అన్నారు. అగ్నిమాపక వారోత్సవాలను పురస్కరించుకుని స్థానిక టీకేఆర్ పాలిటెక్నిక్ కళాశాలలో శనివారం అవగాహన కార్యక్రమం, కరపత్రాల పంపిణీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యుత్ వల్ల అగ్నిప్రమాదాలు సంభవిస్తే ప్రథమంగా మెయిన్ స్విచ్ ఆఫ్ చేసిన తరువాతే అగ్నిప్రమాదాన్ని నివారించే ప్రయత్నం చేయాలన్నారు. ఇల్లు వదిలి ఎక్కువ రోజుల పాటు బయటకు వెళ్లేటప్పుడు విద్యుత్ మెయిన్, గ్యాస్ రెగ్యులేటర్లను ఆఫ్ చేయాలని సూచించారు. ఆయిల్, పెట్రోల్ తదితర అగ్నిప్రమాదాల నివారణకు బయో కెమికల్ పౌడర్ ఇంట్లో అందుబాటులో ఉంచుకోవాలన్నారు. గ్యాస్‌లీకై మంటలు రేగినప్పుడు కార్బన్ డై ఆక్సైడ్ సిలిండర్‌ను అందుబాటులో ఉంచుకోవాలన్నారు. వంట గదిలో గ్యాస్ వాడకం పూర్తయిన వెంటనే రెగ్యులర్ వాల్వ్ కట్టాలన్నారు. గ్యాస్ లీకై నట్లు అనుమానం వస్తే వెంటనే రెగ్యులేటర్ వాల్వ్ ఆపివేయాలని, అటువంటి సమయాల్లో ఎలక్ట్రికల్ స్విచ్‌లు వేయటం, ఆపటం చేయకూడదన్నారు. వంట గదిలో కిరోసిన్, డీజిల్, పెట్రోల్, అదనపు గ్యాస్ సిలిండర్లు వంటివి ఉంచకూడదన్నారు. వంట చేసే సమయంలో కాటన్ దుస్తులు ధరించాలన్నారు. గది నిండా పొగ కమ్ముకుంటే మోచేతులు, మోకాళ్లపై పాకాలని, ముక్కు, నోటికి అడ్డుగా తడిగుడ్డ ఉంచితే పొగ లేదా కార్బన్ డై ఆక్సైడ్‌ను పీల్చకుండా ఉండవచ్చన్నారు. వంటికి మంటలు అంటుకుంటే పరిగెత్తకుండా నేలపై దొర్లాలని, కాలిన శరీర భాగంపై చల్లని నీటిని పోయాలన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ తమ్మా భాస్కర్‌రెడ్డి, అధ్యాపక సిబ్బంది, ఫైర్ సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న అగ్నిమాపక వారోత్సవాలు

గుడివాడటౌన్: అగ్నిమాపక వారోత్సవాలు రెండవ రోజు గుడివాడ పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్, గ్యారేజ్, గుడివాడ రైల్వే స్టేషన్ ప్రాంగణం వద్ద అగ్నిమాపక సిబ్బంది అగ్నిప్రమాదాలు జరిగినప్పుడు ఎలా నియంత్రించాలో వాటర్ డెమో ద్వారా ప్రత్యక్షంగా ప్రదర్శించారు. వంట గదిలో గ్యాస్ లీక్ అయినప్పుడు భయపడకుండా గ్యాస్ రెగ్యులేటర్‌ను ఆఫ్ చేసే విధానం, గ్యాస్ సిలెండర్ బహిరంగ ప్రదేశానికి తీసుకురావడం, గ్యాస్ లీక్ అయి మంటలు వ్యాపించినపుడు ఆ మంటలను మనకు అందుబాటులో ఉన్న వస్తువులతో ఏ విధంగా ఆర్పాలో తదితర అంశాలను వివరించారు.

అగ్నిప్రమాదాల నివారణపై ప్రచారం

కైకలూరు: అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా శనివారం రెండో రోజు కైకలూరు ప్రభుత్వాసుపత్రి, బస్టాండ్, రైల్వేస్టేషన్లలో ప్రజలకు అగ్నిప్రమాద నివారణపై ముద్రించిన కరపత్రాలను పంపిణీ చేశారు. అగ్నిప్రమాదం జరగకముందే నివారణ చర్యలు తీసుకోవడం ఉత్తమమని అగ్నిమాపకాధికారి క్రాంతికుమార్ చెప్పారు.

చంద్రబాబు సెల్ఫీ చాలెంజ్ పెద్ద నాటకం



ఆటపాకలో ఎమ్మెల్యే డీఎన్నార్, ఎమ్మెల్సీ జయమంగళను సత్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

కైకలూరు: లక్షల ఇళ్లు కట్టాం అంటూ టిడ్కో గృహాల వద్ద చంద్రబాబు సెల్ఫీ చాలెంజ్ పెద్ద నాటకమని ఎమ్మెల్సీ జయమంగళ వెంకటరమణ విమర్శించారు. కైకలూరు వైఎస్సార్‌సీపీ కార్యాలయం వద్ద ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్)తో కలిసి ఆయన శనివారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. గ్రామాల్లో సంక్షేమ పథకాలు పొందిన కుటుంబాల ఇళ్ల వద్ద చంద్రబాబు సెల్ఫీ దిగితే ప్రజల స్పందన తెలుస్తుందన్నారు. చంద్రబాబు పాలనలో గ్రామకంఠాల్లో పూరిళ్ల స్థానంలో ఇళ్లు కట్టుకోమని చెప్పారని గుర్తుచేశారు. ప్రజలకు అనుకూలమైన ప్రాంతాల్లో భూములను కొనుగోలు చేయలేదన్నారు. సీఎం జగన్ పాలనలో రూ.కోట్లు వెచ్చించి భూ సేకరణ చేసి పేదలకు నివేశన స్థలాలు అందించారన్నారు. ఈ నెల 7న ప్రారంభమైన జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమంలో 98 శాతం ప్రజలు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పాలనపై సంతృప్తి వ్యక్తం చేశారని తెలిపారు. ఆక్వా పరిశ్రమకు అత్యధిక ప్రాధాన్యం కల్పించి ఆదుకున్న సీఎం జగన్‌కు కొల్లేరు ప్రజలు అండగా ఉంటారని చెప్పారు. వైఎస్ జగన్ మరో పర్యాయం ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేయడం ఖాయమన్నారు. ప్రజల్లో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిపై వెల్లువెత్తుతున్న విశేష ఆదరణ చూసి ఓర్వలేక ప్రతిపక్షాలు చేస్తున్న విమర్శలను తిప్పికొట్టాలని ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్) పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎంపీపీ అడవి కృష్ణ, సర్పంచ్ దానం మేరీ నవరత్నకుమారి, ఏఎంసీ చైర్‌పర్సన్ దండే పుష్పలత, వైస్ ఎంపీపీ మహమ్మద్ జహీర్, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు మంగినేని రామకృష్ణ, మండల సర్పంచ్‌ల సంఘ అధ్యక్షుడు చెరుకువాడ బలరామరాజు, వైఎస్సార్ సీపీ నాయకులు సయ్యపురాజు గుర్రాజు, దండే రవిప్రకాష్, నిమ్మల సాయి, కూనవరపు సతీష్ తదితరులు పాల్గొన్నారు.

జయమంగళకు ఎమ్మెల్సీ సముచిత నిర్ణయం

కొల్లేరు ప్రాంతానికి చెందిన జయమంగళ వెంకటరమణకు ఎమ్మెల్సీ కేటాయించి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి సముచిత నిర్ణయం తీసుకున్నారని ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్) అన్నారు. ఎమ్మెల్సీ జయమంగళ వెంకటరమణ పుట్టిన రోజు సందర్భంగా శనివారం ఆటపాకలో ఎమ్మెల్సీ కార్యాలయం వద్ద ఆత్మీయ సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్సీ జయమంగళ మాట్లాడుతూ కొల్లేరు సమస్యల పరిష్కారానికి సీఎం జగన్ కృత నిశ్చయంతో ఉన్నారని చెప్పారు. కార్యక్రమంలో నాలుగు మండలాల ఎంపీపీలు అడవి కృష్ణ, చందన ఉమామహేశ్వరరావు, పెద్దిరెడ్డి శ్రీరామదుర్గాప్రసాద్, రామిశెట్టి సత్యనారాయణ, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు భట్రాజు శివాజీ, రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ సంబూరి శ్రీదేవి, వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ ప్రధాన కార్యదర్శి ముంగర నరసింహారావు, ఏలూరు జిల్లా వైఎస్సార్‌సీపీ సేవాదళ్ అధ్యక్షుడు బలే నాగరాజు తదితరులు పాల్గొన్నారు. తొలుత ఎమ్మెల్సీ జయమంగళ కొల్లేటికోట పెద్దింట్లమ్మను దర్శించుకుని పూజలు చేశారు.

పుట్టినరోజు శుభాకాంక్షలు

ఎమ్మెల్సీ జయమంగళ వెంకటరమణ పుట్టిన రోజు సందర్భంగా కైకలూరు వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఎంపీపీ అడవి కృష్ణ ఆధ్వర్యంలో వేడుక నిర్వహించారు. జయమంగళతో కేక్ కట్ చేయించి ఎమ్మెల్యే డీఎన్నార్ శుభాకాంక్షలు తెలిపారు.

అంబేడ్కర్ ఆలోచనలు ఆదర్శనీయం



ఆవకూరులో అంబేడ్కర్, వైఎస్ విగ్రహాల వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీ వెంకటరమణ



కలిదిండి సెంటర్‌లో అంబేడ్కర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే డీఎన్నార్

ఎమ్మెల్యే డీఎన్నార్, ఎమ్మెల్సీ జయమంగళ

కైకలూరు: అంబేడ్కర్ మహాశయుడి ఆలోచనా విధానాలకు అనుగుణంగా అందరూ నడుచుకోవాలని ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్), ఎమ్మెల్సీ జయమంగళ వెంకటరమణ పిలుపునిచ్చారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతి సందర్భంగా వారిరువురూ నియోజకవర్గంలో కైకలూరు, రాచపట్నం, కలిదిండి, భుజబల పట్నం, సోమేశ్వరం, పల్లెవాడ, వేమవరప్పాడు తదితర గ్రామాల్లో అంబేడ్కర్ విగ్రహాలకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంబేడ్కర్ ఆశయాలకు అనుగుణంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారన్నారు. విజయవాడలో 125 అడుగుల అంబేడ్కర్ విగ్రహంతో పాటు, స్మృతివనం త్వరలో ప్రారంభించనున్నట్టు చెప్పారు.

మట్టి నమూనాల సేకరణపై శిక్షణ

పామర్రు: నేలలో ఉండే సూక్ష్మ, స్థూల పోషకాల లభ్యతను తెలుసుకోవడం కోసం మట్టి నమూనా పరీక్షలను నిర్వహించాలని మచిలీపట్నం జిల్లా ట్రెయినింగ్ సెంటర్ డీఆర్‌సీ కె.జ్యోతిరమణి అన్నారు. స్థానిక కార్యాలయంలో మట్టి నమూనా వారోత్సవాలలో భాగంగా మట్టి నమూనాల సేకరణ అనే అంశంపై మండలంలోని వీఏఏలకు శనివారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మట్టి నమూనాలను ఏవిధంగా సేకరణ చేయాలి, నమూనాల ప్రాముఖ్యతల గురించి వివరించారు. పరీక్షల ఫలితాల ఆధారంగా రైతులు ఎంత మేరకు ఎరువులు వినియోగించవచ్చనేది తెలుస్తుందన్నారు. కార్యక్రమంలో డీఆర్‌సీ ఏవో బి.పద్మజ, పామర్రు ఏడీఏ బి.స్వర్ణలత, ఏవో నాగరాణి పాల్గొన్నారు.

పామర్రు(పమిడిముక్కల): పమిడిముక్కల గ్రామంలోని రైతు భరోసా కేంద్రంలో మండల వ్యవసాయ అధికారి శనివారం గ్రామ వ్యవసాయ సహాయకులకు భూసార పరిరక్షణ, మట్టి నమూనాల సేకరణపై శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఓ ఎస్.గణేష్‌రెడ్డి మాట్లాడుతూ గ్రామ వ్యవసాయ సహాయకులకు రైతు పొలంలో మట్టి నమూనా సేకరించే విధానం, మట్టిని పరీక్షించుకోవడం వలన వచ్చే లాభాలను నేలను కాపాడుకునే విధానాన్ని భూసార పరీక్షలు అనుసరించి ఎరువుల వాడకం వలన రైతులకు కలిగే ప్రయోజనాలను వివరించారు.

మట్టి నమూనాపై శిక్షణ

మండవల్లి: మండవల్లి ఏడీఏ కార్యాలయంలో గ్రామ వ్యవసాయ సహాయకులకు ఏడీఏ జి.వెంకటమణి మట్టి నమూనాపై శనివారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మట్టి నమూనా ఆవశ్యకత, కలుగు ఉపయోగాలు వివరించారు. మట్టి నమూనా ఎలా తీయాలి, ఎంత పరిమాణంలో తీయాలో మాస్టర్ ట్రైనర్ అజయ్, దినేష్ వివరించారు. క్షేత్ర స్థాయిలో నమూనా తీయడం చూపించారు. వీఏఏలు రైతులకు శిక్షణ నిర్వహించి, రైతుల సహకారంతో మండలానికి 20 శాంపిల్స్ తీయాలని ఏవో షేక్ జరీనా తెలిపారు.

మట్టి పరీక్షలతో సాగు ఖర్చు ఆదా

గుడ్లవల్లేరు: సాగు భూముల్లో మట్టి నమూనా పరీక్షలతో సాగు ఖర్చు ఆదా అవుతుందని ఏఓ సునీల్ అన్నారు. మట్టి పరీక్షల వారోత్సవాల్లో భాగంగా శనివారం వడ్లమన్నాడులోని సాగు నేలల్లో మట్టి నమూనాలను పరీక్షల కోసం సేకరించారు. ఈ పరీక్షల ఫలితాలతో ఏ సాగు నేలకు ఎంత మేరకు ఎరువులు ఉపయోగించవచ్చో తెలుసుకోవచ్చునని ఏవో చెప్పారు. కార్యక్రమంలో వ్యవసాయ సలహా కమిటీ జిల్లా డైరెక్టర్ పెన్నేరు ప్రభాకరరావు, ఎంపీటీసీ మండా దిలీప్‌కుమార్, ఉప సర్పంచి రాంబాబు, రైతులు, సిబ్బంది పాల్గొన్నారు.

మొవ్వ: మట్టి నమూనాలు సేకరించి, భూసార పరీక్షలు నిర్వహించి సాయిల్ హెల్త్ కార్డులు జారీ చేయాలని మొవ్వ ఏడీఏ ఎస్.శ్యామల సూచించారు. మట్టి పరీక్షా వారోత్సవాల్లో భాగంగా శనివారం కూచిపూడి రైతు భరోసా కేంద్రంలో మట్టి సేకరణ, భూ పరీక్షలపై ఎనాలసిస్ ప్రక్రియలపై గ్రామ వ్యవసాయ సహాయకులకు ఒక రోజు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో మొవ్వ వ్యవసాయ అధికారి కె.శివ ప్రసాద్, వీఏఏలు పాల్గొన్నారు.

భూసార పరీక్షలు తప్పనిసరి

కైకలూరు: వ్యవసాయ రైతులు తప్పనిసరిగా భూసార పరీక్షలు చేయించుకుని వాటి ఫలితాల ఆధారంగా సాగు చేయాలని కైకలూరు ఏడీఏ ఆర్.గంగాధరరావు సూచించారు. స్థానిక వ్యవసాయశాఖ కార్యాలయంలో శనివారం నిర్వహించిన మట్టి పరీక్ష, శిక్షణ కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. అనంతరం వింజరం గ్రామంలో మట్టి నమూనాలను సేకరించారు. కార్యక్రమంలో కైకలూరు, కలిదిండి మండలాల ఏఓలు ఆర్.దివ్య, ఆర్.విద్యాసాగర్, వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.